కలగా రైతు బజార్

- 3 లక్షల జనాభా ఉన్నా పట్టించుకోని అధికారులు
- అందని సబ్సిడీ సరకులు



టమాటాలు



ఎంవీపీ రైతు బజార్‌లో సబ్సిడీ టమాటాలు కోసం లైన్‌లో ప్రజలు

జగదాంబ: సుమారు 3 లక్షల జనాభా...నగరంలోనే దక్షిణ నియోజకవర్గం ప్రముఖ వ్యాపార కూడలి..నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు..ఎక్కువగా పేద, మధ్య తరగతి ప్రజలు నివసించే ప్రాంతం. తోపుడబండ్లు వ్యాపారులు, వీధి వ్యాపారులు, నేలవ్యాపారులు, కూలిపనులు చేసుకునేవారే ఎక్కువ మంది. ఇటువంటి నియోజకవర్గంలో రైతు బజార్ లేకపోవడంతో ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ సరకులు అందడం లేదు. కొన్ని వారాలుగా టమాటా ధరలు ఆకాశాన్నంటుతున్న విషయం తెలిసిందే. బయట మార్కెట్లో రూ.80పైగా అమ్మకాలు సాగిస్తున్నారు. దీంతో ప్రభుత్వం రైతు బజార్లలో సబ్సిడీపై టమాటాలు విక్రయిస్తున్న సంగతి తెలిసిందే. దక్షిణ నియోజకవర్గ ప్రజలకు మాత్రం ఇవి అందడం లేదు. రైతు బాజర్‌లేక బయట మార్కెట్లోనే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంది. దీంతో ఆర్థిక భారం పడుతోందని పేద,మధ్య తరగతి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వ్యయప్రయాసలతో....

ప్రభుత్వం రైతుబజార్లలో రాయితీపై ఉల్లి, టమాటా, ఒక్కో సమయంలో పప్పులు వంటివి విక్రయిస్తుంది. దక్షిణంలో రైతు బజార్ లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో దూరంగా ఉన్న ఎంవీపీ, పెదవాల్తేరు రైతుబజార్లను ఆశ్రయిస్తున్నారు. తూర్పు నియోజకవర్గంలో ఎంవీపీ కాలనీ, పెద వాల్తేరు ప్రాంతాల్లో రైతుబజార్లకు వచ్చి కొనుగోలు చేసుకుంటున్నారు. కానీ సబ్సిడీలో వచ్చిన సంతోషం దూరబారం నుంచి వచ్చే ఆటో ఖర్చులలో పోతుందని వాపోతున్నారు. గతంలో ఉల్లి ధరలు కూడా పెరిగినప్పుడు కూడా ఇదే పరిస్థితి ఎదురైందని స్థానికులు వాపోతున్నారు.

దక్షిణంపైనే ఎందుకీ నిర్లక్ష్యం

నగరంలో మధ్యతరగతి ప్రజల నుంచి అత్యధిక ధనికులు ఉండే మద్రిపాలెం, కంచరపాలెం, సీతమ్మదార, ఎంవీపీ, పెదవాల్తేరు, గోపాలపట్నం, నర్సింహనగర్, కొత్తగా ఆరిలోవ ప్రాంతాల్లో రైతుబజార్లు ఏర్పాటు చేశారని కానీ పేదలు ఎక్కువగా ఉండే దక్షణంలో ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రజలు ప్రభుత్వాన్ని, అధికారులను ప్రశ్నిస్తున్నారు. పేరుకు పూర్ణామార్కెట్, రామకృష్ణరైతుబజార్ ఉన్న తమకు ఎటువంటి ఉపయోగంలేదని చెబుతున్నారు. అధికారులు స్పందించి పాతనగరంలో అనుకూలమైన ప్రాంతంలో రైతుబజార్ ఏర్పాటు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వం స్పందించాలి



అసలైన పేదవాళ్లు ఉండే నియోకవర్గం దక్షిణం.. కానీ ఇక్కడే రైతుబజార్ లేకపోవడంతో సబ్సిడీపై సరకులు పొందలేకపోతున్నాం. ప్రభుత్వం స్పందించాలి. రైతుబజార్ ఏర్పాటు చేసి పాతనగరం వాసులను ఆదుకోవాలి

–వరలక్ష్మి, పండావీధి, జీవీఎంసీ 35వ వార్డు

చాంతాడంత క్యూ



సబ్సిడీ కోసం రైతుబజార్లకు వెళ్లినా ఆ ప్రాంతీయులు అవకాశం ఇవ్వడంలేదు. రైతు బజార్ సమీప ప్రజలు అప్పటికే క్యూలో ఉంటున్నారు. మేం వెళ్లేసరికి క్యూ చాంతాడంత ఉంటుంది. మా వరకు వచ్చేసరికి సరకు అయిపోతోంది. దీంతో నిరాశతో వెనుదిరగాల్సి వస్తోంది.

–రామయమ్మ, చిలకవీధి, జీవీఎంసీ 39వ వార్డు

రైతు బజార్ ఏర్పాటుకు సహకరించాలి



దక్షిణ నియోజకవర్గంలో అందరికీ అనుకూలంగా ఉన్న ప్రాంతం రైతు బజార్ ఏర్పాటు చేయాలి. లక్షలాది మందికి ఉపయోగపడుతుంది. అధికారులు రైతు బజార్ ఏర్పాటుకు కృషి చేయాలి. అలాగే స్థానిక ఎమ్మెల్యే కూడా రైతు బజార్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

–బాబ్జి, పాతపోస్టాఫీసు, జీవీఎంసీ 39వ వార్డు

పాతనగరంలో బాలకార్మికులు

చిన్నాచితకా పనుల్లో 200 మంది పిల్లలు

దాబాగార్డెన్స్: పాతనగరంలో ఉన్న పలు మురికివాడలతో పాటు సంచార జీవితాన్ని గడిపే వారు అధికంగా ఉన్నారు. అక్కడి చిన్నారుల్లో బడికి వెళ్లేవారి సంఖ్య చాలా తక్కువ. ఐదేళ్ల వయసు వచ్చే వరకూ వీధుల్లో ఆటపాటలతో కాలక్షేపం చేస్తున్నారు. ఐదేళ్లు దాటితే చిన్నా చితకా పనులు, పాచిపని, చేపలు పట్టే పనుల్లో తల్లిదండ్రులకు సహకరిస్తుంటారు. ఈ విషయంలో ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అంతగా పట్టించుకోవడం లేదు. దీంతో సుమారు రెండు వందల మంది చిన్నారులు బాల కార్మికులుగా మారి బతుకు బండి లాగిస్తున్నారు. ఇలా వెళ్లే చిన్నారులు ఆధిపత్య పోరు కోసం తరచూ గొడవ పడడం ఈ ప్రాంతంలో సర్వసాధారణంగా కనిపిస్తోంది. తండ్రితో పాటు మద్యం దుకాణానికి వెళ్లి మద్యం సేవించే సంఘటనలు కూడా పెరుగుతున్నాయి. ఈ వ్యవహారాలు పాతనగరంలో ఉన్న జాలారిపేట, రెల్లివీధి, ఫెర్రీరోడ్డు, చిలకపేట, పద్మానగర్, కొబ్బరితోట, కల్లుపాకలు తదితర ప్రాంతాల్లోని మురికివాడల్లో నిత్యం మనకు కనిపిస్తుంటాయి. నగరంలో 700కు పైబడి మురికి వాడలను ప్రభుత్వం లెక్కతేల్చిన నేపథ్యంలో అక్షరాస్యతను ఈ వాడల్లో పెంచాల్సిన ఆవశ్యకత పెరిగింది. నగరాన్ని స్మార్ట్ సిటీగా పరిగణించిన నేపథ్యంలో ప్రథమంగా మురికివాడల్లో అక్షరాస్యతను పెంచే దిశాగా అధికారులు తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది.

సత్యదేవుని ఆలయంలో పౌర్ణమి పూజలు



రమా సహిత సత్యనారాయణ స్వామి



సామూహిక వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

దాబాగార్డెన్స్: నగరంలోని ఇసుకకొండ (బాబాజికొండ)పై వెలసిన రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయం గురువారం భక్తులతో కిటకిటలాడింది. ఆశ్వయుజ పౌర్ణమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు. వేకువ జాము 4 గంటల నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. నగరం నుంచే గాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి తరలి వచ్చారు. ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరిగాయి. ఆలయ కార్యనిర్వాహణాధికారి రాజగోపాల్‌రెడ్డి పర్యవేక్షించారు. మధ్యాహ్నం వరకు భక్తుల తాకిడి కనిపించింది. భక్తుల సౌకర్యార్థం సర్వదర్శనంతో పాటు రూ.20, రూ.200, రూ.300 టికెట్లు అందుబాటులో ఉంచారు. వేకువజాము 4 గంటలకు అనివెట్టి మండపం వద్ద సామూహిక వ్రతాలు, ప్రత్యేక పూజలు జరిపారు. ధ్వజస్తంభ పూజలు జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు.

భక్తులకు తప్పిన కష్టాలు

స్వామి దర్శనానికి భక్తుల కష్టాలు తప్పాయి. స్వామి దర్శనానికి వెళ్లాలంటే కేజీహెచ్ మార్చురీ మీద, ఏవీఎన్ కళాశాల డౌన్ రోడ్డులో గల ఆంధ్రా మెడికల్ కళాశాల అటానమి విభాగం మీదుగా వెళ్లేవారు. మరికొంత మంది భక్తులు సాలిపేటలో గల మెట్ల మార్గం మీదుగా స్వామి దర్శనానికి చేరుకునేవారు. ఘాట్‌రోడ్డు అందుబాటులోకి రావడంతో ద్విచక్రవాహనదారులు, ఆటోలో వచ్చే ప్రయాణికులు నేరుగా కొండపైకి చేరుకున్నారు.

రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయంలో అన్నదానం



అన్నసమారాధనలో పాల్గొన్న రమణమూర్తి

అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్ కూడలిలో గల రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ పీవీ రమణమూర్తి పాల్గొని అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గురువారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ గౌరవాధ్యక్షుడు పీలా వెంకట అప్పలనాయుడు, అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యదర్శి బొద్దు పోలరావు, ముఖ్య సలహాదారు బొడ్డేటి ప్రసాద్‌లు స్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు కామేశ్వరశర్మ, కమిటీ ప్రతినిధులు వాసుపల్లి నారాయణ, సత్యనారాయణ, బడే నాగరాజు, పంపాన గణేష్ పాల్గొన్నారు.

ముగిసిన దసరా ఉత్సవాలు

అల్లిపురం: జీవీఎంసీ 29వ వార్డు రామజోగిపేటలో శ్రీ సాయిదుర్గా ఆటో స్టాండ్ డ్రైవర్ల ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో వార్డు జనసేన నాయకుడు మన్యాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువత ప్రధాన పాత్ర పోషించాలి



మాట్లాడుతున్న విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మంజుల

అల్లిపురం: దేశాభివృద్ధిలో యువత ప్రధాన పాత్ర పోషించాలని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్) ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల అన్నారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, కెరియర్ గైడెన్స్ సెల్, జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఎన్ఎస్ఎస్ సంయుక్తంగా గురువారం కళాశాలలో నిర్వహించిన వికసిత్ భారత్–2047, ఉమెన్ ఎంపవర్‌మెంట్ కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2047 నాటికి దేశం అభివృద్ధి చెందిన జాబితాలో ఉండాలంటే యువత ప్రధాన పాత్ర పోషించాలన్నారు. వారి ఆలోచనలు ఆచరణలో పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ బి.సంతోషి అనూష, ఉమెన్ ఎంపవర్‌మెంట్ కన్వీనర్ ఎస్.అనురాధ, జీ.సునీత, విద్యాకల్పన, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మను దర్శించుకున్న వాసుపల్లి



కనకదుర్గమ్మ సన్నిధిలో వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం: విజయవాడ కనకదుర్గ అమ్మవారిని వైజాగ్ డిఫెన్స్ అకాడమీ, రామబాణం కళాశాలల ఎండీ, మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం దర్శించుకున్నారు. బుధవారం దసరా అనుపు ఉత్సవాలు ఘనంగా ముగియడంతో కనకదుర్గమ్మను దర్శించుకున్నట్లు వాసుపల్లి తెలిపారు. నూతనంగా ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్తగా నియమితులైన విజయసాయిరెడ్డి నేతృత్వంలో మళ్లీ తిరిగి మంచిరోజులు రానున్నట్లు ఆయన తెలిపారు. అందరి క్షేమాన్ని కాంక్షించిన జగన్‌మోహన్‌రెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని కో రుకున్నట్లు తెలిపారు. మళ్లీ 2025లో జరిగే జమిలి ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అఖండ మెజార్టీతో గెలుపొంది జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య మంత్రి కావాలని అమ్మవారికి పూజలు చేసినట్లు తెలిపారు.

వాల్మీకి మహర్షి అడుగుజాడల్లో నడవాలి



వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

మహారాణిపేట: హిందువుగా జన్మించిన ప్రతి ఒక్కరూ అనుసరించవలసిన ఆదర్శ కావ్యం రామాయణం. అలాంటి రామాయణాన్ని రచించింది వాల్మీకి మహర్షి. ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమి శ్రీ వాల్మీకి జయంతి సందర్భంగా ఆ మహర్షిని స్మరించుకోవడం చాలా ఆనందంగా ఉందని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) పి.నారాయణమూర్తి అన్నారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామాయణం కేవలం ఒక కథ మాత్రమే కాదన్నారు. అది మన జీవితాలకు దిక్సూచి అని కొనియాడారు. పంచాయితీరాజ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు మాట్లాడుతూ ఆధునిక యుగంలో మనం ఎన్నో మార్పులను చూస్తున్నామని, మార్పుల మధ్యలో మనం మన సంస్కృతి,విలువలను ఆదర్శాలను మర్చిపోతున్నామన్నారు. వాల్మీకి మహర్షి చూపించిన మార్గంలో నడవాలన్నారు.

22న అంతర కళాశాలల గణిత పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ సిస్టర్ షైజీ

కంచరపాలెం: విద్యార్థుల్లో అంతర్గత ప్రతిభాపాటవాలను ప్రోత్సహించే దిశలో సెయింట్ జోసెఫ్ కళాశాలలో అంతర కళాశాలల గణిత పోటీలు నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ పేర్కొన్నారు. ఈ మేరకు జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో గురువారం గణిత విభాగాధ్యక్షులు డాక్టర్ కెప్టెన్ సుజాత ఆధ్వర్యంలో ఈ 22న నిర్వహించనున్న గణిత పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. నగరంలో పలు కళాశాల విద్యార్థులు పోటీల్లో పాల్గొంటారని, విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు సుజాత తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పి.కె. జయలక్ష్మి, డాక్టర్ గౌరీశంకర్, ప్రవీణ్, భారతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

జలమయం



కాన్వెంట్ జంక్షన్ వద్ద..



జలమయమైన ఆశీలుమెట్ట రహదారి



జ్ఞానాపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో చేరిన నీటిని మోటారు సాయంతో కాలువలోకి విడిచిపెడుతున్న దృశ్యం

విశాఖలో గురువారం వర్షం దంచికొట్టింది. ఉదయం నుంచి దఫదఫాలుగా భారీ వర్షం కురిసింది. దీంతో దక్షిణ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ముఖ్యంగా కాన్వెంట్ జంక్షన్, అల్లిపురం, జ్ఞానాపురం తదితర ప్రాంతాల్లో రోడ్లపై భారీగా వర్షం నీరు చేరింది. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, విధులకు హాజరయ్యే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యవస్తంగా ఉండడంతో పలు చోట్ల మురుగు రోడ్లపై ప్రవహించింది. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వచ్చిన వారంతా వర్షంలో తడిసి ముద్దయ్యారు. –ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

క్లుప్తంగా

సిరులతల్లికి పంచామృతాభిషేకం



కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం నిర్వహించారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ

అల్లిపురం: వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఆర్.రవిచంద్రన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. డాబాగార్డెన్స్, అల్లూరి విజ్ఞానకేంద్రంలో గురువారం జరిగిన సిల్వర్ జూబ్లీ కార్యక్రమంలో ఏడు దేశాల్లో, 1860 క్లబ్బులలో లక్ష మంది సభ్యులకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డిస్ట్రిక్ట్ గవర్నర్ అడ్డగళ్ల గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా నాలుగు రాష్ట్రాల్లో ఒకే రోజు వెయ్యి కుట్టు మిషన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కందుల నాగరాజు పాల్గొని మాట్లాడుతూ వాసవీక్లబ్ అంటేనే సమాజ సేవకు పర్యాయ పదంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో వాసవిక్లబ్ మెంబర్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భార్య వేధింపుల నుంచి కాపాడండి



మాట్లాడుతున్న సారెళ్ల శ్రీధర్

అల్లిపురం: అంధుడనని కూడా పోలీసులు కనికరించడం లేదని సారెళ్ల శ్రీధర్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం డాబాగార్డెన్స్‌లో గల వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను అంధుడనని తెలిసీ పెళ్లి చేసుకున్న తనభార్య వేధింపులకు గురిచేస్తోందని, పక్కా ప్రణాళికతో నా ఉద్యోగం, ఆస్తి కోసం పోలీసులకు తప్పుడు ఫిర్యాదులు చేసిందని ఆవేదన వ్యక్తం చేశాడు. తాను హెచ్‌బీ కాలనీలో నివసిస్తున్నానని, పుట్టుకతోనే తాను అంధుడినని తెలిపారు. 2006 డిసెంబర్ 28న కొత్తవలసకు చెందిన వెడువాక వెంకట ధనలక్ష్మీతో తనకు వివాహం అయిందన్నారు. పెళ్లైన తరువాత నుంచి ఆమె వేధిస్తోందని, తప్పుడు కేసులు పెడుతూ హింసిస్తోందన్నారు. తాను ఆమెపై పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఎక్కడికి వెళ్లినా తనకు న్యాయం జరగలేదని, మీడియా ద్వారా తన గోడును తెలియజేసుకుంటున్నానని పేర్కొన్నారు.

ఘనంగా మాన్యుసూక్త హోమం



శ్రీఆంజనేయ స్వామి దేవాలయంలో హోమంలో పాల్గొన్న భక్తులు

మహారాణిపేట: మెయిన్ రోడ్డులో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ఆశ్వయుజ పౌర్ణమి పురస్కరించుకొని గురువారం మాన్యుసూక్త హోమం ఘనంగా నిర్వహించారు. ప్రతి నెల పౌర్ణమి రోజున స్వామివారికి హోమం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి అల్లు జగన్నాథం తెలిపారు. హోమంతో నరఘోష, శత్రు ఘోష, రుణ బాధ, గ్రహదోష శాంతి కోసం కార్యసిద్ధి కలుగుతుందన్నారు.

రైతుల నుంచి ధాన్యం సేకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: జిల్లాలో 2024–25 సంవత్సరానికి ఖరీఫ్ పంట కాలంలో రైతుల నుంచి విరివిగా ధాన్యం సేకరించాలని నిర్ణయించారు. గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. పౌరసరఫరాల సంస్థ జిల్లా బ్రాంచ్ ఆధ్వర్యంలో ఈ సీజన్‌లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడానికి తమ పంటను ఈ పంటలో నమోదు చేసుకోవాలన్నారు. రైతు సేవ కేంద్రంలో వ్యవసాయ సహాయకుల ద్వారా ఈ నమోదు కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. ఇందుకు సంబంధించిన కొనుగోళ్ల ఏజెన్సీ వారికి సంబంధించిన మాయిశ్చర్ మీటర్లు, తార్పాలిన్లు, ఎలక్ట్రానిక్ కాటాలు తదితర వస్తువులు సమకూర్చుకొని సిద్ధంగా ఉండాలని జేసీ ఆదేశించారు.

ఘనంగా ఎరుకుమాంబ ఆలయ వార్షికోత్సవం



ఎరుకుమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

సీతమ్మధార: దక్షిణ నియోజకవర్గం పరిధి 27వ వార్డు దొండపర్తిలో గల శ్రీ ఎరుకుమాంబ అమ్మవారి దేవస్థానం వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునుంచే అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి పూజలు, అభిషేకాలు చేశారు. అమ్మవారికి శ్రీలక్ష్మీగణపతి హోమం , ప్రాతఃకాల అర్చనలు, అన్న కుంభరాశి పూజలు జరిగాయి. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ చైర్మన్ గొలగాని వీరారావు (బుజ్జి), వార్డు టీడీపీ అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మీశివప్రసాద్, 42వార్డు బీజేపీ అధ్యక్షుడు కన్నం గురుగోవింద్ సింగ్, ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు గంగరాజు, వెంకట సత్యనారాయణ, గురునాథ రెడ్డి, బసవబోయిన సుజాత,కుంతీ, ఆలయ ఈవో రమాబాయి పాల్గొన్నారు.

నర్సుల సంఘానికి 19 నామినేషన్లు

మహారాణిపేట: ఏపీ ప్రభుత్వ నర్సులు సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నికల కోసం దాఖలు చేసిన నామినేషన్లను గురువారం ఎన్నికల అధికారి బి.శ్రీనివాస్‌రావు పరిశీలించారు. మొత్తం 9 పోస్టులకు గాను 19 మంది నామినేషన్ దాఖలయ్యాయి. నామినేషన్లన్నీ సక్రమంగానే ఉన్నాయని శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం నామినేషన్లు ఉపసంహరించుకోవచ్చు.

ఏయూ విభాగాల్లో రెక్టార్ ఆకస్మిక తనిఖీలు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు గురువారం పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోషల్ వర్క్, సోషియాలజీ, జర్నలిజం, ఎకనామిక్స్, తెలుగు, సైకాలజీ, హిందీ విభాగాలను సందర్శించారు. ఆయా విభాగాల్లో సిబ్బంది హాజరు పట్టికలు, బోధనా విధానాలను పరిశీలించారు.

సిబ్బంది అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: జిల్లాలో వర్షాలు అధికంగా కురుస్తున్నాయని, ప్రాథమిక, ఆరోగ్య కేంద్రాల్లో, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో పలు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటికి సంబంధించి నీటిని క్లోరినేషన్ చేయించాలన్నారు. నీటి నిల్వలు లేకుండా,దోమలు ప్రబల కుండా అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. మాతా, శిశు ఆరోగ్య సేవలు, మాతృ మరణాలు, శిశు మరణాలపై సమీక్ష చేశారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వర రావు, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ గౌరీ శంకర్, జిల్లా టీబి నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎస్.జీవనరాణి, పలు విభాగాల వైద్యులు నరేష్ కుమార్, ఉమావతి, ఆరోగ్య శ్రీ సమన్వయకర్త డాక్ట ర్ అప్పారావు, డాక్టర్ ఎస్.వి.సమత, జిల్లా మలేరియా అధి కారి తులసి పాల్గొన్నారు.